సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
90324 97123
నంబర్‌ను సంప్రదించండి



రోడ్డును కొలుస్తున్న జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు



అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేసిన రోడ్డు



రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ తోట పద్మావతి



రాజమార్గం

పేద, మధ్య తరగతి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు, అభివృద్ధి, సంక్షేమం అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తదేక దీక్షతో పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని 34వ వార్డులో రహదారులు వేసి స్థానికుల ఏళ్ల నాటి కష్టానికి తెర దించారు. కొత్తగా సీసీ, బీటీ రోడ్లు వేయడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పాయని బౌడారారోడ్డు, యాతపేట, కొబ్బరితోట ప్రాంతీయులు సీఎంకు ధన్యావాదాలు చెప్పుకుంటున్నారు.

రహదారులు అభివృద్ధి చేసిన వైనం

- రూ. **43** లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం
- రూ. **30** లక్షల వ్యయంతో బీటీ రోడ్ల నిర్మాణం
- పాతనగరానికి చెందిన బౌడారారోడ్డు, యాతపేట, కొబ్బరితోట ప్రాంతీయులకు లబ్ధి

- 34వ వార్డులో బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం
- బౌడారారోడ్డు, యాతపేట, కొబ్బరితోట రహదారులకు మోక్షం
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

అల్లిపురం : గత ప్రభుత్వంలో జీవీఎంసీ ఎన్నికలు జరగకపోవడంతో ప్రత్యేక అధికారి పాలన కొనసాగేది. ఆ సమయంలో వార్డుల్లో అభివృద్ధి కుంటుపడింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అభివృద్ధి పరుగుపెడుతోంది. వార్డు ప్రజల సౌకర్యార్థం జీవీఎంసీ 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి రూ.73 లక్షలతో బౌడారారోడ్డు, యాతపేట, కొబ్బరితోట ప్రాంతాల్లో బీటీ రోడ్లు, సీసీ రోడ్లు నిర్మించారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కొబ్బరితోటలో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు

ఇప్పుడు రోడ్లు బాగున్నాయి..



వార్డులో రోడ్లు బాగులేవని కార్పొరేటర్ పద్మావతికి చెప్పిన వెంటనే ఆ సమస్యపై దృష్టి సారించారు. తక్కువ కాలంలోనే రోడ్లు వేయించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేయడం ఆనందంగా ఉంది.

– కె.గురుమూర్తి, యాతపేట

సీసీ రోడ్లు, బీటీ రోడ్లు చక్కగా ఉన్నాయి



గతంలో రోడ్లు అధ్వానంగా ఉండేవి. గత 4 సంవత్సరాలుగా నియోజకవర్గంలో దఫదఫాలుగా రోడ్లను అభివృద్ధి చేశారు. వార్డు కార్పొరేటర్ చక్కగా పని చేస్తున్నారు. సమస్యలు పరిష్కరిస్తున్నారు.

– తోలాట అప్పలరాజు, కొబ్బరితోట

గతంలో ఇబ్బంది పడేవాళ్లం..



మాది యాతపేట. గతంలో ఎక్కడ పడితే అక్కడ గోతులుండేవి. చెప్పుకుందామన్నా నాయకులు దొరికే వారు కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత 34వ వార్డు కార్పొరేటర్‌గా తోట పద్మావతి గెలిచారు. ఆమెకు రోడ్ల దుస్థితి తెలియజేసిన వెంటనే స్పందించి రోడ్లు వేయించారు.

– ఎస్.రాంబాబు

క్లుప్తంగా

ప్రజాదర్బార్‌కు పలు వినతులు



ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : సూపర్ స్టార్ కృష్ణ విగ్రహం నెలకొల్పేందుకు చౌల్ట్రీ జంక్షన్‌లోని పార్కులో స్థలం కేటాయించాలని కోరుతూ కృష్ణ అభిమానులు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం జామియా మసీదు వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే వాసుపల్లికి రెల్లివీధి బజారులో దొంగతనాలు జరుగుతున్నాయని వ్యాపారులు మొరపెట్టుకున్నారు. దీంతో ఆయన జోనల్ కమిషనర్‌కు ఫోన్ చేసి సమస్య వివరించారు. స్వరార్చన ఆధ్వర్యంలో శత జయంతి ఉత్సవాల ఆహ్వాన పత్రికను సంస్థ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన శత జయంతి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, స్టేట్ డైరెక్టర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నేషనల్ సింపోజియం

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ కళాశాలలో నేషనల్ సింపోజియం ముగిసింది. 2 రోజులుగా బయో టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో చిరుధాన్యాల ప్రాముఖ్యతపై ఏర్పాటు చేసిన జాతీయ సదస్సు శుక్రవారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా టీకేబ్స్–ఈ ప్రిన్సిపల్, సైంటిస్ట్, లీడ్ ఇన్‌స్ట్రక్టర్ డాక్టర్ వై. రవికిరణ్ పాల్గొని మాట్లాడారు. అత్యాధునిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సింథటిక్ బయాలజీ, నానో టెక్నాలజీ కూడా రైతులకు ఉపయోగకరమన్నారు. కన్వీనర్ వీరబ్రహ్మం సింపోజియం నివేదిక సమర్పించి సదస్సు విజయానికి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం చిరు ధాన్యాలలోని పోషక విలువలపై వివిధ కళాశాలల విద్యార్థులు రూపొందించిన పోస్టర్లను పరిశీలించి జ్ఞాపికలు, ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ విభాగాధ్యాపకులు డాక్టర్ సాయిగణేష్, తేజశ్విని, ఊర్మిళ, దీపిక, పీఆర్‌వో డాక్టర్ పీకే జయలక్ష్మి, పలువురు సైంటిస్టులు, కళాశాల ఫ్యాకల్టీ, రీసెర్చి స్కాలర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మళ్లీ సీఎం కావాలి



మాట్లాడుతున్న కొడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం : ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ని, వైఎస్సార్‌సీపీని వీడబోమని జీవీఎంసీ 41వ వార్డు ప్రజలు, జేసీఎస్ అర్బన్ క్లస్టర్ ఇన్‌చార్జి కొడిగుడ్ల శ్రీధర్ పేర్కొన్నారు. ఈ మేరకు జ్ఞానాపురం వైఎస్సార్‌సీపీ వార్డు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరు ఎన్ని చెప్పినా, ఎన్ని ప్రలోభాలు పెట్టినా సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని, వాసుపల్లిని వీడిదే లేదన్నారు. మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా వాసుపల్లిని గెలిపించుకునేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. కిషోర్, రాజేష్, మోహన్, శౌరీ, ప్రసన్న, కుమార్, స్థానికులు పాల్గొన్నారు.

మహా జనసభను విజయవంతం చేయాలి

మహారాణిపేట : జనవరి 7న విశాఖలో మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ మొదటి మహా జనసభ నిర్వహిస్తున్నట్లు ఏపీ జేఏసీ అమరావతి స్టేట్ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో ఉన్న రెవెన్యూ భవన్‌లో ఉమ్మడి విశాఖ జిల్లా, తూర్పు గోదావరి జిల్లా కార్యవర్గ సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. మొదటి మహా జనసభకు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు సుమన్, ఏపీ జేఏసీ అమరావతి అసోసియేట్ చైర్మన్ టీవీ ఫణి పేర్రాజు, మున్సిపల్ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.ఈశ్వర్, అప్పలరాజు, జిల్లా జేఏసీ చైర్మన్ సత్తి నాగేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ సౌత్
7997958342, 9912440606

కనకమహాలక్ష్మిని దర్శించుకున్న కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి



మంత్రికి అమ్మవారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారులు

దాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర కల్పవల్లి కనకమహాలక్ష్మిని కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి మదన్‌మోహన్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతించి ఆయనచే అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెగా రుణమేళాకు విశేష స్పందన



రుణాల నమూనా పత్రాన్ని ఆవిష్కరిస్తున్న గణేష్ రామన్, మహేష్‌కుమార్ బజాజ్

దాబాగార్డెన్స్ : అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఇండియన్ బ్యాంక్ నిర్వహించిన మెగా సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ అండ్ క్రెడిట్ అవుట్‌రీచ్ క్యాంపునకు విశేష స్పందన వచ్చింది. బ్యాంక్ ఫీల్డ్ జనరల్ మేనేజర్(హైదరాబాద్) గణేష్ రామన్ పాల్గొని బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మహేష్ కుమార్ బజాజ్‌తో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గణేష్ రామన్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం రెండు తెలుగు రాష్ట్రాల్లో (తిరుపతి, అమరావతి, విజయవాడ, రాజమండ్రి, హైదరాబాద్, కరీంనగర్, విశాఖపట్నం) ప్రాంతాల్లో నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా 8070 సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌లకు రూ.1200 కోట్ల రుణాలు అందజేశారు. రిటైల్ క్రెడిట్, అగ్రికల్చర్, ఎంఎస్ఎంఈలకు రూ.150 కోట్ల రుణాలు అందజేసినట్లు గణేష్‌రామన్ తెలిపారు. ఐదుగురికి కారు లోన్లు అందజేశామన్నారు. చీఫ్ మేనేజర్(రిటైర్డ్) జి. రాంబాబు బ్యాంకు సిబ్బంది, స్వయం సహాయక గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

మెరుగైన నైపుణ్యంతో ఉన్నత శిఖరాలకు



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

దాబాగార్డెన్స్ : మనం ఇతరులతో ఎప్పుడూ పోల్చుకోకూడదని ఆంధ్ర విశ్వ విద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె. సమత పేర్కొన్నారు. విద్యార్థులు తమ నైపుణ్యం మెరుగు పరుచుకుంటే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని తెలిపారు. పైడా ఉమెన్స్ కళాశాలలో 'కళాకృతి' పేరిట ఇంటర్మీడియట్, డిగ్రీ ఫెస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ సమత పైడా విద్యాసంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. సరోజ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక ప్రత్యేకత దాగి ఉంటుందని, దానిని గుర్తించి అభివృద్ధి చేసుకోగలిగితే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని అభిప్రాయపడ్డారు. పైడా సంస్థల అధినేత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు తమ గురువుల పైన, చదువుతున్న కళాశాల పట్ల అంకిత భావంతో మెలగాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ సరోజ్ మాట్లాడుతూ గెలుపు కంటే అందులో పాల్గొనడమే తొలి విజయంగా భావించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ, పాటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు పక్కాగా అమలయ్యేలా..

ప్రత్యేక అధికారుల నియామకం


సాక్షి, విశాఖపట్నం : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్క లబ్ధిదారుకి చేరేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునను ఆదేశించారు. నవరత్నాల సంక్షేమ ఫలాలు అందరికీ అందేందుకు మండలాల వారీగా పర్యవేక్షణ అవసరమని సూచించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాల పర్యవేక్షణకు 11 మండలాలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ కలెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలాల పరిధిలో ఉన్న సచివాలయాల పరిధిలో క్షేత్రస్థాయి పర్యటనలు చేయడంతో పాటు అవగాహన సదస్సులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. రెండో దశ జగనన్న ఆరోగ్య సురక్ష, వైఎస్సార్ పింఛను కానుక, చేయూత, ఆసరా తదితర కార్యక్రమాల నిర్వహణ, అమలుపై సచివాలయ సిబ్బందితో స్థానికంగా సమావేశాలు నిర్వహించాలని, ప్రభుత్వ విధానాలు తెలపాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ప్రత్యేకాధికారులు వీరే...

మండలం	ప్రత్యేకాధికారి	హోదా
పద్మనాభం	జి. సూర్యప్రకాశరావు	జిల్లా పౌర సరఫరాల అధికారి
భీమునిపట్నం	ఎస్. భాస్కరరెడ్డి	ఆర్డీవో, భీమిలి
ఆనందపురం	టి. సీతారామ్మూర్తి	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్
విశాఖపట్నం రూరల్	జీవీఎస్ఎస్ రామమోహన్‌రావు	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్
సీతమ్మధార	చక్రవర్తి	డీపీవో, జీవీఎంసీ
మహారాణిపేట	చంద్రిక	డీపీవో, జీవీఎంసీ
గోపాలపట్నం	పి. శేషశైలజ	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్
ములగాడ	టి. ప్రవీణ	జిల్లా కో-ఆపరేటివ్ అధికారి
గాజువాక	డి. లక్ష్మారెడ్డి	ఎస్టేట్ అధికారి, వీఎంఆర్డీఏ
పెదగంట్యాడ	డాక్టర్ వి.సన్యాసిరావు	అదనపు కమిషనర్, జీవీఎంసీ
పెందుర్తి	డి. హుస్సేన్ సాహెబ్	ఆర్డీవో విశాఖపట్నం

అరుదైన వ్యాధికి అద్భుత చికిత్స

- పసివాడిని కాపాడిన కేజీహెచ్ వైద్యులు



తల్లీబిడ్డతో కేజీహెచ్ సూపరింటెండెంట్, చికిత్సనందించిన వైద్య బృందం

మహారాణిపేట : అత్యంత అరుదుగా వచ్చే హైపవర్ ఎక్లెప్సియా (శరీరం బిగుతుగా మారిపోయే జబ్బు) వ్యాధి సోకిన పసివాడిని కేజీహెచ్ పిల్లల వైద్యులు కాపాడారు. సరైన రోగ నిర్ధారణ చేసి, అత్యుత్తమ వైద్య సేవలు అందించడంతో బాబు పూర్తిగా కోలుకున్నాడు. దీంతో శుక్రవారం బాబును డిశ్చార్జి చేసినట్టు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. ఎన్ఏడీ కొత్త రోడ్డులోని గణేష్‌నగర్‌కు చెందిన పోలవరపు వెంకటేష్, రాజ్యలక్ష్మి దంపతులకు మగపిల్లాడు పుట్టాడు. బాబు పుట్టుకతో శరీరం బిగుతుగా మారిపోయే జబ్బు కలిగి ఉన్నాడు. అతన్ని నగరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చినా వ్యాధి నయం కాలేదు. చివరి ప్రయత్నంగా ఈనెల 6న కేజీహెచ్ పిల్లల వార్డులో చేర్చారు. బాబును తాకినా, శబ్దం విన్నా అతని శరీరం బిగుసుకుపోవడం, ఫిట్స్ రావడాన్ని వైద్యులు గమనించారు. మేనరికాల వల్ల, జెనెటిక్ సమస్య వల్ల ఆ వ్యాధి వస్తుందని పిల్లల వార్డు విభాగాధిపతి ఆచార్య ఎం.ఎస్.రాజు తెలిపారు. రోగ నిర్ధారణ చేయడం, అవసరమైన మందులు ఇవ్వడం వల్ల బాబు పూర్తిగా కోలుకున్నాడని డాక్టర్ రాజు వివరించారు. పిల్లల విభాగం ఆచార్య శంకర్, డాక్టర్లు సత్యవాణి, పద్మావతి, నాయుడు, నర్సులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది వైద్య సేవలు అందించారు. వీరికి బాబు తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు.

అట్రాసిటీ కేసులు త్వరగా పరిష్కరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున. చిత్రంలో డీసీపీ క్రైం వెంకటరత్నం, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి

మహారాణిపేట : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పెండింగ్ కేసులకు వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని వివిధ విభాగాల అధికారులకు కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున సూచించారు. ఎస్సీ, ఎస్టీ యాక్ట్ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై కలెక్టర్ స్పందించారు. క్లిష్టమైన కేసుల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపాలని, వివరాల సేకరణలో జాప్యం లేకుండా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సుదీర్ఘంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై మరింత శ్రద్ధ వహించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. గత సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలపై ఇప్పటి వరకు తీసుకున్న చర్యల గురించి ఆరా తీశారు. సివిల్ రైట్స్‌పై సామాన్యులకు అవగాహన కల్పించాలని పోలీసు అధికారులకు సూచించారు. స్టే కేసులపై ప్రత్యేక చొరవ చూపి హైకోర్టు పీపీతో సంప్రదించాలని స్థానిక పీపీకి చెప్పారు. స్పందన ద్వారా వచ్చే కేసులు, దిశ ద్వారా నమోదయ్యే కేసులకు తక్షణ పరిష్కారం చూపాలన్నారు. బాధితులకు ప్రభుత్వం నుంచి వచ్చే రిలీఫ్, రిహేబిలిటేషన్ ఆర్థిక సాయం అందించాలని సంబంధిత అధికారులు తెలిపారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రామారావు, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర రెడ్డి, డీసీపీ క్రైం వెంకటరత్నం, పలువురు ఏసీపీలు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా.. ఆడుదాం–ఆంధ్రా

- వివిధ క్రీడల్లో సత్తా చాటుతున్న యువత
- మైదానాల వద్ద పండగ వాతావరణం



ఇందిర ప్రియదర్శిని స్టేడియంలో ఖోఖో ఆడుతున్న యువకులు



కబడ్డీ ఆడుతున్న యువకులు

జగదాంబ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, ఖోఖో తదితర ఆటలు ఆడేందుకు యువత పెద్ద ఎత్తున పోటీ ప్రాంగణాలకు క్యూ కడుతున్నారు. దీంతో క్రీడా మైదానాల వద్ద పండగ వాతావరణం నెలకుంటోంది. ఈ నేపథ్యంలో 35వ వార్డులో ఆడుదాం ఆంధ్రా పోటీలు ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగాయి. శుక్రవారం ఇందిర ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో కోకో, క్రికెట్, కబడ్డీ పోటీలు నిర్వహించగా.. యువత భారీ స్థాయిలో పాల్గొన్నారు. సెక్రటరీల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలకు మంచి ఆదరణ లభిస్తోంది.

రెండు స్క్రాప్ దుకాణాల దగ్ధం

మంటల్లో కాలిపోయిన కారు



దగ్ధమవుతున్న స్క్రాప్ దుకాణం



పూర్తిగా దగ్ధం అయిన కారు

జగదాంబ: ప్రమాదవశాత్తూ నిప్పంటుకుని రెండు స్క్రాప్ దుకాణాలు దగ్ధమయ్యాయి. జీవీఎంసీ 35వ వార్డు ఫ్రూట్ మార్కెట్ దరిలో స్క్రాప్ దుకాణాలు ఉన్నాయి. శుక్రవారం ఉదయం 7.30 గంటల సమయంలో దుకాణాలకు సమీపంలో చలి కాచుకునేందుకు చెత్తకు మంట పెట్టారు. ప్రమాదవశాత్తూ పక్కనే ఉన్న పాత టైర్లకు మంటలు అంటుకున్నాయి. ఈ క్రమంలో స్క్రాప్ టైర్ల దుకాణం, పాత సామాన్ల దుకాణంతోపాటు ఓ కారు మంటల్లో పూర్తిగా కాలిపోయాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న అగ్నిమాపక కేంద్రం సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో మూడు లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని దుకాణ యజమానులు తెలిపారు. వన్ టౌన్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి.. ఘటనపై ఆరా తీశారు. కాగా.. ఈ నెలలో స్క్రాప్ దుకాణాలు దగ్ధం కావడం ఇది రెండోసారి. ఈ ఘటనలపై సమగ్ర విచారణ చేపట్టాలని యజమానులు కోరుతున్నారు.

వికసిత్ భారత్ యాత్రలో భాగస్వామ్యం కావాలి



మాట్లాడుతున్న అజయ్‌జైన్

దాబాగార్డెన్స్ : స్వచ్ఛంద సేవకులు వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగస్వామ్యం కావాలని, ఇది అందరి సత్ సంకల్పమని ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్ తెలిపారు. జోన్–4 పరిధి 36వ వార్డు రెల్లివీధి, ఏవీఎన్ కాలేజీ వద్ద శుక్రవారం భారత్ సంకల్ప్ యాత్రలో స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశాల సరసన చేరడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాలు రూపొందించి అమలు చేస్తుందని తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ మంచి ఆలోచనతో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు, ఆర్థిక ప్రయోజనాలు అందేలా అవగాహన కార్యక్రమాలు అమలు చేయడమే లక్ష్యంగా వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాల గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, జోనల్ కమిషనర్ శివ ప్రసాద్, ఏపీడీ పుణ్యవతి, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని హుండీ ఆదాయం రూ.10.79 లక్షలు

దాబాగార్డెన్స్ : ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి హుండీ ఆదాయం శుక్రవారం లెక్కించారు. 153 రోజులకు గాను రూ.10 లక్షల 78 వేల 929 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె. శిరీష ఆదేశాల మేరకు జగన్నాథస్వామి ఆలయ ఈవో టి. రాజగోపాలరెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన హుండీ లెక్కింపులో శ్రీహరి సేవా వలంటీర్ అసోసియేషన్ ప్రతినిధి ఎన్. అప్పారావు, శ్రీవారి సేవకుడు నగేష్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

శ్రీ యెర్నిమాంబ అమ్మవారి దేవస్థానం
జ్ఞానాపురం, విశాఖపట్నం

ఆర్.సి.నెం.23/2023, తేది. 29-12-2023

టెండరు కమ్ బహిరంగ వేలం

శ్రీ యెర్నిమాంబ అమ్మవారి ఆలయము వారిచే ఈ దిగువ తెలిపిన అంశముకు సంబంధించి శ్రీ యెర్నిమాంబ అమ్మవారి ఆలయము నందు టెండర్ కం బహిరంగ వేలం **తేది: 10.01.2024 బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు** ఆలయ ప్రాంగణంలో ఈ క్రింది అంశము గురించి బహిరంగ వేలం నిర్వహించబడును.

వ. నెం.	వివరము	లైసెన్సు కాలపరిమితి	ధరావత్తు
1.	భక్తులు విడిచిన చిన్న తీర్థం పెద్ద తీర్థం వగైరాలు ప్రోగు చేసుకొని తీసుకొనిపోవు హక్కు	తేది: 01.02.2024 నుండి 31.01.2026 వరకు	రూ. 10,000/-

పై టెండరు కం బహిరంగ వేలం గురించి మిగిలిన విషయములను కార్యాలయ పనివేళలో తెలుసుకొనవచ్చును.
కార్యనిర్వహణాధికారి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ సౌత్
9010810033, 7075989701
Office mail : sakshiadvtvsp@gmail.com